# ఆదిలాబాద్-మంచిర్యాల

తెలుగు దినపత్రిక

# సూర్య



www.suryaaa.com

♦ నిర్మల్ ♦ కొమురంభీం ఆసిఫాబాద్

గురువారం 02 జనవరి 2025 , పేజీలు 04


## ఈ నెల 3న బహిరంగ విచారణ..జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ఆసిఫాబాద్ ,1 జనవరి, సూర్య మేజర్ న్యూస్**

షెడ్యూల్డ్ కులముల ఉప వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమీషన్ ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి డా. షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బహిరంగ విచారణ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా (ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్) ప్రజల అభిప్రాయాలను బహిరంగ విచారణలో స్వీకరించడం జరుగుతుందని, ఈ నెల 3వ తేదీ ఉదయం 11 గంల నుండి మధ్యాహ్నం 2 గం.ల వరకు జరుగనున్న బహిరంగ విచారణలో జిల్లాలోని అన్ని ఎస్.సి. కులాల సంఘాల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ అమూల్యమైన అభిప్రాయాలు, వినతులు సమర్పించవచ్చని తెలిపారు.

## కేజీబీవీ విద్యార్థినులతో కలిసి అల్పాహారం స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**నిర్మల్ జనవరి 1, సూర్య మేజర్ న్యూస్**

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కేజీబీవీ విద్యార్థినులతో కలిసి ఉదయం పూట అల్పాహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటిస్తూ, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. నూతన సంవత్సరంలో నూతన ఉత్సాహంతో ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి గణాంక వివరాలను

## వెల్లడించిన జనరల్ మేనేజర్

**శ్రీరాంపూర్, జనవరి 1, సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు గనులు డిసెంబర్ నెలలో సాధించిన ఉత్పత్తి గణాంకాల వివరాలను ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి సూర్యనారాయణ బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన, విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన




మాట్లాడుతూ కార్మికులకు,వారి కుటుంబాలకు,ప్రజలకు అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సెప్టెంబర్ నెలలో భూగర్భ గనులు లక్ష్య ముప్పై ఎనిమిది వేల టన్నుల ఉత్పత్తికి గాను లక్ష ఇరవై నాలుగు వేల టన్నులు సాధించాయని అని అన్నారు. ఉపరితల గనులు నాలుగు లక్షల నలభై వేల టన్నులకు, ఐదు లక్షల ముప్పై ఒక వేల టన్నుల ఉత్పత్తి సాధించాయన్నారు. ఉపరితల గనులలో 38.79 ఎల్పిసిఎంల ఓబీ వెలికితీయడం జరిగిందని, రోడ్డు , రైలు ద్వారా 6 లక్షల 36 వేల టన్నుల బొగ్గు రవాణా జరిగిందని వివరించారు. డిసెంబర్ 27వ తేదీన రికార్డ్ స్థాయిలో 28,509 టన్నుల ఉత్పత్తి ,భూగర్భ గనులలో డిసెంబర్ 30వ తేదీన 5,578 టన్నులు,ఏరియా గనులు అత్యధికంగా డిసెంబర్ నెలలో 6.56 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జిఎం ఎన్ సత్యనారాయణ, డీజీఎంలు అరవింద్ రావు,చిరంజీవులు, సీనియర్ పి.ఓ కాంతారావు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల నిరవధిక సమ్మె

**బెజ్జూర్,జనవరి 1,సూర్య మేజర్ న్యూస్:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద



బుధవారం హమాలీ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు.ప్రభుత్వం పెంచిన రేట్లకు అనుగుణంగా తమకు చెల్లించడం లేదని వారు వాపోయారు.సమస్యను పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని హమాలీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ స్పష్టం చేశారు.ఈ సమ్మెలో హమాలీలు నాయిని మారుతి,మానేపల్లి బాపూరావు,బుర్రి గణేష్,ఎడ్ల రమేష్ పాల్గొన్నారు.

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా

## 30 పోలీస్ యాక్ట్ అమలు

**- ముందస్తు అనుమతి లేకుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిషేధం**

**- జనవరి 1 వ తేదీ నుంచి జనవరి 31 తేది వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ నిబంధనలు వర్తిస్తాయి, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు**

**- జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు**

**ఆసిఫాబాద్ ప్రతినిధి 1 జనవరి సూర్య మేజర్ న్యూస్**

శాంతిభద్రతల దృష్ట్యా, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి జనవరి నెల 1 వ తేదీ నుండి జనవరి 31 వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ వివరాలు వెల్లడించారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆపైపోలీస్



ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఏలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు.నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి కొలిపే ఎటువంటి ఆయుధాలు కల్గిఉండరాదని తెలిపారు.ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కల్గించేందుకు దారితీసే ఇబ్బందికర ప్రజా సమావేశాలు, జన సమూహం అలాంటివి పూర్తిగా నిషేధం అన్నారు.చట్టపరమైన జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని సూచించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా అందరూ పాటించాలన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎటువంటి అనుమతులు లేని ర్యాలీలు నిర్వహించిన వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు భద్రత పై

## ఆటోడ్రైవర్లకు అవగాహన

**వాంకిడి జనవరి 1,సూర్య మేజర్ న్యూస్**

రోడ్డు భద్రత నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మాధవి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఆటో పాయింట్ వద్ద డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించకూడదని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. వాహనాలను ఎప్పటికప్పుడు ఫిట్నెస్ చేయించుకోవాలని, ప్రతీ డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలు నడిపేందుకు ఇవ్వడం నేరమవుతుందని తెలిపారు. వాహనాలను విక్రయించే సమయంలో వివరాలు పూర్తిగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ సిబ్బంది సంతోష్, ఆటో డ్రైవర్లు రాజన్న తదితరులు పాల్గొన్నారు.




## సబ్ డివిజన్ ఎఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించి మర్యాద పూర్వకంగా జిల్లా ఎస్పీని కలిసిన రాజేష్ మీనా


**నిర్మల్ ప్రతినిధి, జనవరి 1, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ సబ్ డివిజన్‌కి ఎ.ఎస్.పిగా నూతనంగా నియమితులైన రాజేష్ మీన బుధవారం సబ్ డివిజన్ బాధ్యతలు స్వీకరించి మర్యాద



పూర్వకంగా జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిలనీ కలవటం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల్ సబ్ డివిజన్ సమస్యలపై చర్చించటం జరిగింది. రాజేష్ మీనా ఐ.పి.ఎస్ రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవారు, ఐఐటీ జోద్పూర్ లో ఇంజనీరింగ్ పూర్తిచేసారు. 2022లో సివిల్స్‌లో ఐపీఎస్‌గా సెలెక్ట్ అయ్యారు. ట్రైనింగ్ పూర్తీ చేసుకుని గ్రేహౌండ్‌లో దళ కమాండర్‌గా విధులు నిర్వర్తించి ఇప్పుడు నిర్మల్ సబ్ డివిజన్ ఎ.ఎస్.పిగా నియమితులైనారు.

# సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ ఆర్డర్ పత్రాలు పంపిణీ





**మందమర్రి, జనవరి 1, సూర్య మేజర్ న్యూస్.**
మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సీనియారిటీ ప్రాతిపదికన సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ (ఎస్ ఎల్ పి) ఆర్డర్లను ఇన్చార్జి మేనేజర్ సిహెచ్ రమేష్ అందజేశారు. బుధవారం ఏరియాలోని కేకే5 గనిలో విధులు నిర్వహిస్తున్న 22 మంది కార్మికులకు ఎస్ ఎల్ పి ప్రమోషన్ ఆర్డర్ పత్రాలను ఏఐటియుసి నాయకులతో కలిసి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగిని సంస్థ గుర్తిస్తుందని, కార్మికులు అధికారులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల రక్షణ, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని కార్మికులు రక్షణ చర్యలు పాటిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షులు భీమనాథుని సుదర్శన్, ఏరియా జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, కెకె-5 పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, జనరల్ షిఫ్ట్ ఇన్చార్జి జశ్వంత్, ఇంజనీర్ శ్రీనివాస్, షిఫ్ట్ అండర్ మేనేజర్ రవి, గని సంక్షేమాధికారి కార్తీక్, మేనేజ్మెంట్ ట్రైని పర్సనల్ ఆకుల రవళి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

**నిర్మల్ జనవరి 1, సూర్య మేజర్ న్యూస్**



ఆర్టీసీ నిర్మల్ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఈ నెల 01.01.2025 నుండి 31.01.2025 వరకు నిర్వహిస్తున్నట్లు డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు.ప్రమాదాలు ఎలా జరుగుచున్నాయి.ఇప్పటి వరకు ప్రమాదాలు ఎలా జరిగాయి వాహనాలను ఎలా ఓవర్ టేక్ చేయాలి. మూల మలుపుల దగ్గర ఎలా అప్రమత్తంగా ఉండాలి పవర్ పాయింట్ ,వీడియో లను ప్రొజక్టర్ ద్వారా కళ్ళకు కట్టినట్లు చూయించారు.మనం ప్రజా రవాణ లో పని చేస్తున్నాము.మనపై ప్రయాణికులు నమ్మకముతో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారు.మనం డ్యూటీకి బయలు దేరి వచ్చే వరకు మన కుటుంబ సభ్యులు ఎదిరి చూస్తారు.దేశంలోని రోడ్ లు అన్ని చాలా బాగున్నాయి.అన్ని ఫోర్ లైన్స్ సిక్స్ లైన్స్ అని అతివేగంగా అజాగ్రత్తగా వాహనాలు నడుపొద్దని ఆర్టీసీ ఉద్యోగులను ఉద్దేశించి డిపోమేనేజర్ పలు సూచనలు సలహాలు ఇచ్చారు.కార్యక్రమములో అసిస్టెంట్ మేనేజర్ ఐ. రాజశేఖర్,విజలెన్స్ ప్రభుదాస్,ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

### జంగో లింగో పుణ్యక్షేత్రంలో

## ప్రత్యేక పూజలు చేసిన ఆత్రం సుగుణక్క

**జైనూర్ జనవరి 1 మేజర్ సూర్య న్యూస్**
ఆదివాసుల ఆరాధ్యదైవం జంగో లింగో దీక్ష స్వీకరణతో ఆదివాసీలు ఆధ్యాత్మిక మార్గంలో నడవటం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటు ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క



అన్నారు. జైనూర్ మండలంలోని జంగాం జంగో లింగో పుణ్యక్షేత్రంలో భక్తులు జంగో లింగో దీక్షలను బుధవారం స్వీకరించారు. ఈ సందర్భంగా జంగో లింగో ఆలయంలో సుగుణక్క ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సుగుణక్క మాట్లాడుతూ పవిత్ర పుష్యమాసంలో నియమ నిబంధనలతో సంప్రదాయబద్ధంగా పూజలు చేసుకుంటు ఆదివాసీ దేవుళ్లను ఆరాధిస్తామన్నారు. ముఖ్యంగా ఆదివాసులు మంచి మార్గంలో నడవాలని,జంగు భాయి దేవత ఆలోచన మేరకు సత్యం పలకాలి,మంచి మార్గంలో నడవాలని, ప్రతి ఇంట్లో జంగుబాయి దీపం వెలగాలని తెలిపారు. యువత విద్యా వంతులు కావాలని సూచించారు.జంగోలింగో దీక్ష తీసుకుంటున్న భక్తులందరికీ సుగుణక్క ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జంగోలింగో ఘన సంస్థాన్ అధ్యక్షుడు ఆత్రం రఘునాథ్, ప్రధానకార్యదర్శి గేడాం జగ్జీవన్,మాజీ సర్పంచ్ కుంరం శ్యాంరావ్, పీఠాధిపతి కుంరం భగవంతు రావు,వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



## ఆత్మ గౌరవ పోరాటమే భీమా కోరేగావ్ యుద్ధం

### - బిఎస్ఐ జిల్లా అధ్యక్షులు అశోక్ మాహూర్కర్

**వాంకిడి జనవరి 1,సూర్య మేజర్ న్యూస్**
1818 జనవరి 1న మహారాష్ట్రలోని కోరేగావ్ గ్రామం వద్ద మహర్లు, పీష్వా రాజుల మద్య జరిగిన విరోచిత యుద్ధం దళితుల



ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిందని భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహొల్కర్ అన్నారు. బుదవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ , ఖమాన నాగ్సేన్ బుద్ధ విహార్ ఆవరణలో భీమా కోరేగావ్ శౌర్య దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపాన్ని ప్రదర్శించి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ బాబూరావు పీష్వా రాజ్యంలో మహార్లు అంటరానితనంతో దుర్భర జీవితాన్ని గడుపున్న కాలంలో ఈస్ట్ ఇండియా కంపెనిలో 500 మంది సైనికులుగా చేరి సుమారు 28 వేల మంది పీష్వా సైన్యంతో విరోచిన పోరాటం చేసి ఓడించారని అన్నారు. మహార్ వీరత్వాన్ని గుర్తించిన బ్రిటీష్ అధికారులు కోరేగావ్ గ్రామం వద్ద అమరవీరుల స్తూపం నిర్మించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ ఐ మండల అధ్యక్షుడు జైరాం ఉప్రె. నాయకులు విలాస్, రాజేంద్రప్రసాద్, గేడం హిరిషన్, దుర్గం సునిల్, హంసరాజ్, శ్యాంరావు, మహేష్, రోషన్, ప్రతాప్,అరుణ్, రమేష్, ప్రతాప్, ఖమాన నాయకులు కిషన్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు గిరిజన శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సమావేశం

**ఆసిఫాబాద్ ప్రతినిది 1 జనవరి సూర్య మేజర్ న్యూస్**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ గిరిజన శాఖలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సమావేశమును బాలికల పాఠశాలలో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనునట్లు ,జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు రామచందర్,పోచం,చిరంజీవి,రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశంలో ముఖ్యంగా నాలుగో తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పైన చర్చించనున్నట్లు,నూతన జిల్లా కమిటీని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తాతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన శాఖ ఉన్నతాధికారులు హాజరుకానునట్లు,గిరిజన శాఖలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సమస్యల పరిష్కారం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు.

### బెల్లంపల్లిలో జనహిత

## అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం

**బెల్లంపల్లి, జనవరి 1, సూర్య మేజర్ న్యూస్:**
బెల్లంపల్లిలో బుధవారం రోజున జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 305వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఆకలి తో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ




అన్నదాన కార్యక్రమం ఉగాది సందర్భంగా ఏప్రిల్ 13వ తేదీ 2021 న ప్రారంబించడం జరిగిందని, దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ రోజు 305 వ సారి దాత కాసిరెడ్డి పల్లె వాస్తవ్యులు శ్రీమతి శ్రీ బోడకుంట తేజస్వి-రాజేశం దంపతుల కుమారుడు అద్వైత్ వర్మ 6 వ పుట్టినరోజు సందర్భంగా యాచకులకి, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమం లో సుమారు 180 మందికి అన్నదానం చేయడం జరిగిందని ఈ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కొరకు మరింత మంది దాతలు ముందుకు రావాలని అలాగే సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు మరియు జనహిత సేవా సమితి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల రమాదేవి, గౌరవ సలహాదారులు కందుల రాజన్న, సభ్యులు డోలి సుకుమార్, సాయి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


పేద ముసలమ్మకూ

# రెహమాన్ ఫౌండేషన్ సాయం

**- చైర్మన్ షేక్ అబ్దుల్ రెహమాన్ జిలానీ చొరవతో 5వేల రూపాయలు అందజేత - సేవ చేయడమే మా అభిమతం - జాటోత్ దవిత్ కుమార్ రెహమాన్ ఫౌండేషన్ సామాజిక సేవకులు**

**జైనూర్ జనవరి 1 మేజర్ సూర్య న్యూస్**

కుల, మతాల కంటే మానవత్వం గొప్పదని అంటున్నారు రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్ రెహమాన్ జిలానీ. తాజాగా బుధవారం లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన పేద ముసలమ్మ జాటోత్ రాజలీ బాయి (69) గత కొద్దిరోజుల క్రితం పొలం పనులకు వెళ్ళగా ఆకస్మికంగా కాలు జారి పడిపోవడంతో ఎడమ చేయి పూర్తిగా విరిగిపోయింది.రెహమాన్ ఫౌండేషన్ సామాజిక సేవకులు జాటోత్ దవిత్ కుమార్ ద్వారా ఈ విషయం తెలుసుకున్న చైర్మన్ షేక్ అబ్దుల్ రెహమాన్ జిలానీ స్వయంగా ఇంటికొచ్చి విషయాన్ని తెలుసుకొని, ముసలమ్మను పరామర్శించి ఆమె ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని తన సామాజిక సేవలో భాగంగా 5వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని



అందించి మనోధైర్యాన్నిచ్చారు.కులం, మతం పేరిట కొట్టుకుంటూ వర్గాలుగా విడిపోతున్న ఈ రోజుల్లో మతాలు వేరైన ఓ ముసలమ్మకు అండగా నిలిచిన రెహమాన్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి గొప్పతనాన్ని అందరూ అభినందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో రెహమాన్ ఫౌండేషన్ సభ్యులు షేక్ హనీఫ్, షేక్ ఖాసిం, ఆడే అశ్విన్ నాయక్, గ్రామ నాయక్ రాథోడ్ కిరణ్ నాయక్, గ్రామ పెద్దలు జాదవ్ గణపత్ నాయక్, వినోద్ నాయక్ లు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు

# ఎంపికైన ఎంజేపీ విద్యార్థులు

**లక్షెట్టిపేట, సూర్య మేజర్ న్యూస్ :**

ఇటీవల హైదరాబాద్ లో జరిగిన U-19 ఎస్ జి ఎఫ్ స్టేట్ లెవెల్ అథ్లెటిక్స్ లోఎంజేపీ లక్షెట్టిపేట కి చెందిన బి. విష్ణు హై జంప్ లో, గుడిపేట ఎంజేపీ జె.దీపక్ క్రాస్ కంట్రీలో అత్యంత ప్రతిభ కనబర్చి




జాతీయ స్థాయికి సెలెక్ట్ అవ్వడం ఎంతో గర్వకారణం అని ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ అన్నారు. మారుముల గ్రామాల నుండి వచ్చి జాతీయ స్థాయికి సెలెక్ట్ అవ్వడం మన ఆదిలాబాద్కి ఎంతో చెప్పుకో దగ్గ విషయం అని ఎంజేపీ డి సి ఓ శేరు శ్రీధర్ ఆనందం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పీడీలు నాంపల్లి,సురేష్, పిఈటీ రాజేష్ పాల్గొన్నారు.

కనుల పండుగగా

## సామూహిక అయ్యప్ప మహా పడిపూజ

**సోన్, జనవరి 1 సూర్యా మేజర్ న్యూస్:**

కనుల పండుగగా అయ్యప్ప సామూహిక మహా పడిపూజ కార్యక్రమం బుధవారం మండలంలోని న్యూ వెల్మల్,బొప్పారం గ్రామంలో గల సాయిబాబా ఆలయం వద్ద అనురాగ్ శర్మ, పెంట దత్తాద్రి గురు స్వాముల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మొదటి రోజున ఈ సామూహిక మహా పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు..



ఉదయం అయ్యప్పను వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. అయ్యప్ప భక్తులు పాటలు సంకీర్తనలు, నృత్యాలు చేశారు. భజన పాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి. అయ్యప్ప శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం అంత మార్మోగింది. అలంకార ప్రియుడు అయ్యప్పకు పంచామృతంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా 18వ సారి మాల ధారణ చేసిన నారికేళి బీజీ రెడ్డి స్వామిని, అయ్యప్ప స్వాములు జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఐఎన్టియూసి నాయకులు

**మందమర్రి, జనవరి 1, సూర్య మేజర్ న్యూస్.**

కొత్త ఏడాదిలో కొత్త ఉత్సాహంతో మరింత ముందుకు సాగిపోవాలని నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం కేకే 5 గనిపై ఐఎన్టియూసి నాయకులు సింగరేణి కార్మికులను,అధికారులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ,మంచిర్యాల జిల్లా ఐఎన్టియుసి అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో సరికొత్త లక్ష్యాలతో విజయం సాధించాలని,ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతలో మందమర్రి ఏరియా అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్ నాయకత్వంలో కార్మికుల సమస్యలను తీర్చడంలో ఐఎన్టియుసి ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ కార్యదర్శి అలుగుల రవి, పిటి కార్యదర్శి బీమారపు సదయ్య, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి హనుమాండ్ల రాజేంద్రప్రసాద్, నాయకులు కృష్ణ మోహన్, పవన్, కలమండ స్వామి, కమల్, రమేష్, నాయక్,జమ్లానాయక్,వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



## హమాలీ కార్మికుల నిరవధిక సమ్మె

**- న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**- తూతూ మంత్రంగా అధికారుల హామీలు, చర్చలు**

**- పరిష్కరించకపోతే నిరసన ఉద్రిక్తం చేస్తామని హెచ్చరిక**

**లక్షెట్టిపేట, సూర్య మేజర్ న్యూస్ :**

పట్టణంలోని స్థానిక బీట్ బజారు ఆవరణంలో సివిల్ సప్లైగోదాం దగ్గర బుధవారం ఏఐటియూసి ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను హమాలీ కార్మికులు ప్రారంభించారు.ఈ సందర్భంగా సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం అధ్యక్షులు తిప్పని సత్తన్న, ప్రధాన కార్యదర్శి బైరి రాజన్న లు




మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ చార్జీలు పెంచాలని గతంలో అక్టోబర్ 4 రోజున రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై హమాలీ కార్మికులు వారి ను అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తమన్యాయపరమైన సమస్యల పరిష్కరించాలని కోరగా వెంటనే స్పందించిన సివిల్ సప్లై కమిషనర్ డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్పందన లేకపోగా డిసెంబర్ 18న సమస్యలు పరిష్కరించాలని సివిల్ సప్లై ఆఫీస్ ముట్టడి చేసామన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వెంటనే మా డిమాండ్స్‌ను పరిష్కరించాలని నేటి నుండి నిరవధిక సమ్మెను ప్రారంభించాం. ప్రభుత్వం తక్షణమే స్పందించి మా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం లేని యెడల నిరవధిక సమ్మెను ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ సమ్మెలో పెద్ద ఎత్తున హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## గురుబ్రహ్మ అవార్డుకు ఎంపికైన తెలుగు ఉపాధ్యాయుడు

**సోన్, జనవరి 1 సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని న్యూ వెల్మల్ బొప్పారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో



తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బిక్షపతి నాయక్ గురుబ్రహ్మ అవార్డు కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు నాల విద్యాసాగర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మాలోవత్ బిక్షపతి నాయక్ బోధనతో పాటు, వివిధ రకాల విశ్లేషణ రచనలు రాస్తు, విద్యార్థులను, సమాజాన్ని చైతన్య పరుస్తూ విశిష్ట సేవలందిస్తున్నరని ఆయన చేసిన సేవలను కొనియాడారు.గురు బ్రహ్మ పురస్కారం ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మదర్ థెరిసా సేవా సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జనవరి 3వ తేదిన నిర్వహిస్తున్న కార్యక్రమంలో గురుబ్రహ్మ అవార్డును బిక్షపతి నాయక్ కు బహుకరిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు కె.క్రిష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా మాలోవత్ బిక్షపతి నాయక్ ను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామస్తులు అభినందించారు.

## బెల్లంపల్లిలో ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు

**బెల్లంపల్లి, జనవరి 1, సూర్య మేజర్ న్యూస్:**

నూతన సంవత్సర వేడుకలు బెల్లంపల్లి పట్టణంలో మంగళవారం



అర్ధరాత్రి కేకులు కట్ చేసి కాలనీల్లో ప్రజలు కొత్తసంవత్సరం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పలు రాజకీయ పార్టీల నాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణంలోని కల్వరి మినిస్ట్రీస్ చర్చి,సీ ఎస్ ఐ,రోమన్ క్యాథలిక్,సీ ఎం ఐ, శాలేము,పెంత కొస్తల్ తడితర చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కేక్ లు కట్ చేసి కొత్త సంవత్సరం వేడుకలు జరుపు కొన్నారు.కల్వరి మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ ప్రవీణ్ - సిస్టర్ శారోన్ లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ముత్తి నేని రవికుమార్ కుచర్చి లో కేక్ కట్ చేశారు.

## టీఎన్జీవో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు.

**మంచిర్యాల టౌన్, జనవరి 1,సూర్య మేజర్ న్యూస్ :**

మంచిర్యాల జిల్లా కేంద్రం లో 2025 నూతన సంవత్సర వేడుకలు లో భాగంగా టిఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ని,అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ మోతిలాల్‌ని,మంచిర్యాల ఆర్డీవో %+%.శ్రీనివాసరావుని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్చం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఉద్యోగుల సమస్యలపై పై జిల్లా కలెక్టర్ తో చర్చించారు.కలెక్టరేట్ ఉద్యోగుల సౌలభ్యం కొరకు ఆర్టీసీ బస్సులు ఐడిఓసి రిక్వెస్ట్ స్టాప్‌లో ఆపాలని జిల్లా కలెక్టర్ ని శ్రీహరి కోరగా,వెంటనే జిల్లా కలెక్టర్ ఆర్టీసీ డిఎంతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేసారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి భూముల రామ్మోహన్,కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య,అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపు రావు,కోశాధికారి అనుముల సతీష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కేజియా రాణి, తిరుపతి, సంయుక్త కార్యదర్శులు సునీత,పబ్లిసిటీ సెక్రెటరీ యూసఫ్,మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, మందమర్రి యూనిట్ అధ్యక్షులు సుమన్, కార్యదర్శి సిహెచ్ సతీష్,బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోలిశెట్టి పద్మజ,ప్రణవానంద్,తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డుపైకి ముళ్ళ పొదలు - ప్రయాణానికి ఇబ్బందులు

**బోథ్, జనవరి 1,సూర్య మేజర్ న్యూస్**

బోథ్ ఎక్స్ రోడ్ నుండి బోథ్ మండల కేంద్రానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ చెట్లు అడ్డంగా ఏపుగా పెరిగాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డులో ప్రయాణించే వాహనాలు మూల మలుపుల దగ్గర ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ప్రమాదకర పరిస్థితిని అధికారులు దృష్టిలో ఉంచుకొని రోడ్డుపైకి ఏపుగా పెరిగిన ముళ్ళ చెట్లను,కొమ్మలను తొలగించాలని రోడ్డు పై ప్రయాణించే వాహనదారులు,ప్రయాణికులు కోరుతున్నారు.



## సోనాలలో ఘనంగా అయ్యప్ప స్వామి పూజలు

**బోథ్, జనవరి 1,సూర్య మేజర్ న్యూస్**

సోనాల గ్రామంలో అయ్యప్ప సేవా సమితి వారి ఆధ్వర్యంలో



అయ్యప్ప స్వామికి పూజలు ఘనంగా నిర్వహించడం జరిగింది. స్థానిక రామాలయంలో జరిగిన మహా పడిపూజ కార్యక్రమానికి సుమారు 3000 మంది భక్తులు హాజరైనట్లు అంచనా,కిక్కిరిసిన భక్తజన సందోహం మధ్య విశాల్ గురు స్వామి పూజా కార్యక్రమాలను ,అభిషేక ప్రక్రియను శాస్త్రోక్తంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఆర్కెస్ట్రా వారు ఆలపించిన పాటలకు భక్తులందరూ కూడా తన్మయులై చప్పట్లతో సందడి చేశారు.ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్



హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అత్యంత భక్తి శ్రద్ధలతో మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించిన అయ్యప్ప సేవా సమితి వారికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్,మాజీ గ్రామ సర్పంచ్ చెట్లపల్లి సదానందం ,రామాలయ కమిటీ చైర్మన్ జీవి రమణ ఇంకా ప్రముఖులు ,గ్రామ ,చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ,భక్తులు పాల్గొన్నారు.

# దొంగతనంగా మా భూమిని కబ్జా చేసి ఇబ్బందులు పెడుతున్నారు



**- కబ్జా దారులకే అధికారులు సహకరిస్తున్నారని ఆవేదన**

**- వృద్ధ దంపతులు ఇనిగంటి సత్యనారాయణ, పద్మ**

**కాసిపేట, జనవరి 1, సూర్య మేజర్ న్యూస్ :**

కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామ పంచాయతీలోని గురువాపూర్ శివారులోని మా భూములను ఈర్ల సుధాకర్ అనే వ్యక్తి దొంగతనంగా పట్టా చేసుకొని కబ్జా చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అధికారులు కూడా కబ్జాదారులకే సహకరిస్తున్నారని మంథనికి చెందిన వృద్ధ దంపతులు ఇనిగంటి సత్యనారాయణ రావు, పద్మలు కన్నీరు మున్నీరయ్యారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వృద్ధ దంపతులు ఇనిగంటి సత్యనారాయణరావు, పద్మలు మాట్లాడారు. గురువాపూర్ శివారులోని 74/1, 74/1/1 సర్వే నెంబర్లని 49.34 ఎకరాలు భూమి కొనుగోలు చేయగా 22.12 ఎకరాలు పట్టా చేయగా మిగితా పట్టా చేయకుండా మాకు ఉన్న దాంట్లో రిజిస్ట్రేషన్ భూమిని దొంగతనంగా వీర్ల సుధాకర్ అనే వ్యక్తి పట్టా చేసుకొని మా భూమిని కబ్జా చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూమిలో మమ్మల్నే రానివ్వకుండా వృద్ధులని కూడా కనికరం లేకుండా కబ్జా దారులు దౌర్జన్యం చేస్తూ భయాందోళన గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై న్యాయం చేయాలని కోరినా అధికారులు పట్టించుకోకుండా కబ్జా దారులకే సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ దగ్గరికి వెళ్తే పట్టించుకోకుండా కబ్జాదారులకే సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్ఐ కూడా వాళ్ళకే సహకారం చేస్తున్నారన్నారు. వృద్ధులైన మాకు కనీస జాలి కూడా చూపడం లేదని, కాని కబ్జాదారులు వస్తే తహసీల్దార్, ఎస్ఐ వారికే పని చేస్తున్నారన్నారు. మా భూమిని కబ్జా చేసి మమ్మల్నే భయ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంత్రి శ్రీధర్ బాబుని కూడా కలిసి మా సమస్యను వివరించి న్యాయం చేయాలని వేడుకొనున్నట్లు తెలిపారు. కబ్జాదారుల నుంచి మా భూమిని కాపాడి న్యాయం చేయాలని వృద్ధులు వేడుకున్నారు.

# పని స్థలాల పరిశీలన

**కాసిపేట, జనవరి 1, సూర్య మేజర్ న్యూస్**

మందమర్రి ఏరియాలోని కాసిపేట్-2 గనిని మందమర్రి జీఎం దేవేందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ గని అధికారులతో కలిసి పని స్థలాలను పరిశీలించారు.అంతకు ముందు జీఎం కాసిపేట్-2 గని ఉద్యోగస్తులు అందరికీ 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గనిలో 22 మంది ఉద్యోగులకు సర్వీస్ లింక్ ప్రమోషన్స్ ఆర్డర్స్ ను జనరల్ మేనేజర్ అందించారు. విధి నిర్వహణలో ఉద్యోగులు రక్షణ సూత్రాలు పాటించినట్లయితే గనులలో ఎటువంటి ప్రమాదాలు జరగవని, తద్వారా అధిక ఉత్పత్తిని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ లక్ష్మి నారాయణ, ఏఐటియూసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, గని పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, గని అధికారులు పాల్గొన్నారు.



## ఇల్లు కోల్పోయిన బాధితురాలికి చేయూత

**కాసిపేట,జనవరి 1, సూర్య మేజర్ న్యూస్**

కాసిపేట మండలంలోని దేవాపూర్ అచ్యుత్ రావ్ గూడెంకు చెందిన ఆత్రం సత్యవతి ఇల్లు వారం రోజుల క్రితం గ్యాస్ సిలిండర్ పేలి పూర్తిగా దగ్గం కాగా కట్టు బట్టలతో మిగిలిపోయిన సత్యవతి కి బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా మంచి కార్యక్రమంతో నూతన సంవత్సరాన్ని స్వాగతం పలకాలనే ఉద్దేశంతో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రం ఇప్పలగూడ వారి ఆధ్వర్యంలో బాధితురాలికి 5350 రూపాయల ఆర్థిక సాయం నూతన వస్త్రాలు అందజేశారు చేయూత అందించిన వారు శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు సద్గురు పూలాజీ బాబా ఇప్పలగూడ ధ్యాన కేంద్రం అధ్యక్షులు పెంద్రం రాజు, కుర్సెంగ అచ్యుత్ రావ్, వెడ్మ బాపు రావ్, కనక రాము, మడావి తిరుపతి, ఆత్రం రాజు, కుద్మెత జైతు, కుర్సెంగ సోము, పెంద్రం పత్తు బాయి, కుద్మెత అర్జు బాయి, కుద్మెత జంగు బాయి, వెడ్మ గిర్జు బాయి తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం

**కాసిపేట,జనవరి 1, సూర్య మేజర్ న్యూస్**

జనవరి 6 వ తేదిన ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కాసిపేట మండలంలోని వుప్పుమల్ల పోచమల్లు ఇంటి సమీపంలో హనుమాన్ టెంపుల్ ముందర ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐ క్యాంప్ చైర్ పర్సన్ లయన్ వుప్పుమల్ల రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సదావకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్న అధికారులు ప్రజాప్రతినిధులు

**బోథ్,సూర్య మేజర్ న్యూస్:** బోథ్ నియోజకవర్గ శాసనసభ్యులు అనిల్ యాదవ్ కేటీఆర్కు తన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతు బోథ్ నియోజకవర్గ ప్రజలకు నాయకులకు,బిఆర్ఎస్ కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ కొత్త సంవత్సరంలో సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు.ఎంపీ నగేష్ కు శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకులు : ఎంపీ గోడం నగేష్ ను బోథ్ పిఏసిఎస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ తన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బోథ్ ప్రజలకు కూడా తన తరపున శుభాకాంక్షలు తెలియజేశారు, ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సత్వరమే వారి సమస్యలను తీర్చడానికి తన సాయ శక్తుల కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది.

## గని ఉద్యోగులకు ప్రమోషన్ పత్రాల పంపిణీ

**కాసిపేట,జనవరి 1, సూర్య మేజర్ న్యూస్**

కాసిపేట 1 గని లో పని చేస్తున్న 49 మంది ఉద్యోగులకు పదోన్నతులు పత్రాలను బుధవారం ఉదయం మేనేజర్ భూశంకరయ్య, ఏఐటియూసి బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ చేతుల మీద అందచేశారు.అండర్ గ్రౌండ్ ఉద్యోగులు 7 సంవత్సరాలకు వచ్చే రెగ్యులర్ పదోన్నతులను వివిధ క్యాటగిరీలో పనిచేస్తున్న వారికి యాజమాన్యం అందించింది. పదోన్నతి పత్రాలను రక్షణ అధికారి రవీంద్ర నిఖిల్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, బుక్య సుమన్,పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీ నారాయణ అందించారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మీర్జా గౌస్ జీషాన్,సర్వేయర్ ప్రభాకర్,బన్న లక్ష్మన్ దాస్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ రాజేందర్, లింగయ్య,రవి,అనిల్,శ్రీనివాస్,రంజిత్ పాల్గొన్నారు.